సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

హెచ్ఎల్సీ వైపు చూడండి..!



- హంద్రీనీవా రెండో విడత లైనింగ్‌పై రైతుల విముఖత
- శిథిలావస్థకు చేరుతున్న తాగునీటి ప్రాజెక్టులు
- నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా పరిశీలన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా వైపే కాదు... కాస్త తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్ఎల్సి) వైపు కాస్త చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అనంతపురం జిల్లాకు నిఖర జలాలు అందించే ఏకైక ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ కాలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయి ఉన్నాయి. దీంతో పూర్తి ప్రవాహ సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 2024 సంవత్సరంలోనూ ఇదే తరహాలో నీటి పొందలేకపోవడం జరిగింది. తుంగభద్ర డ్యామ్ గేట్లు కొట్టుకుపోయి నీరు వృథాగా కిందకుపోతున్నా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువలో మాత్రం నీటిని పూర్తిస్థాయిలో డ్రా చేయలేకపోవడం జరిగింది. కాలువ గట్లు మొత్తం బలహీనంగా ఉండటంతో నీరు తక్కువగా డ్రా చేస్తున్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోవాలంటే మధ్యలో ఆగిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ చేపట్టాల్సి ఉంది. ఇదివరకు చేపట్టిన ఆధునీకరణ పనులను గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. మరో ఐదేళ్ల పనులు చేపట్టేందుకు వీల్లేదన్న షరతులు పెట్టింది. ఈ షరతులు రద్దై కూడా ఈ ఏడాది ఐదేళ్లు పూర్తవుతోంది. ఈ ప్రభుత్వమైనా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

హంద్రీనీవా మొదటి దశ వెడల్పు చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో జిల్లా జీవనాడి అయిన హెచ్ఎల్సికి అదే ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు. ఇక రెండో దశ లైనింగ్‌పై రైతుల్లో విముఖత వ్యక్తమవుతోంది. లైనింగ్ చేపడితే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న పద్ధతుల్లోనే నీటిని ప్రవహింపజేస్తే భూగర్భ జలాలు పెరిగి ఉద్యానవన పంటలకు ఊతమిచ్చేందుకు అవకాశముంటుందని కోరుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నాడు జిల్లా పర్యటన సందర్భంగా పై రెండు అంశాలను పరిగణలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శిథిలావస్థలో తాగునీటి ప్రాజెక్టులు

అనంతపురం జిల్లాలో తాగునీటి అందించే ప్రధాన ప్రాజెక్టుల్లో సత్యసాయి తాగునీటి పథకం ఒకటి కాగా, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు. సత్యసాయి బాబా సహకారంతో ఏర్పాటైన సత్యసాయి తాగునీటి పథకం పూర్తై మూడు దశాబ్ధాలు కావస్తున్నా నేపథ్యంలో పైపులైన్ సిస్టం పూర్తిగా దెబ్బతింది. దీంతో నిరంతరాయంగా మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిర్మాణ సమయంలోనే నాణ్యతా లోపాలుండడంతో ఆ ప్రాజెక్టులోనూ సాంకేతిక సమస్యలు తరచూ వస్తున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులను పునరుద్ధరించాల్సిన అవసరముందని నిపుణులు సైతం చెబుతున్నారు. ఇక ఇందులో పనిచేసే కార్మికుల సమస్యలు వేరే చెప్పనక్కర్లేదు. వేతనాల కోసం నిరంతరంగా సమ్మెలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వేతనాలకు ప్రత్యేకమైన బడ్జెట్ లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. మూడు నుంచి ఆరు మాసాలైన వేతనాలు అందటం లేదు. ప్రస్తుతం కూడా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోనున్నారు. ప్రభుత్వం దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కార్మికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిమిత్తం ఛాయాపురం వద్ద ఏర్పాటు చేసిన విడిది సమూహాలు

ముఖ్యమంత్రి పర్యటన సాగనుంది ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని ఉండవల్లి నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయానికి ఉదయం 10.50 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో 10.55 గంటలకు బయలుదేరి వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామం చేరుకుంటారు. 11.25 గంటలకు రోడ్డు మార్గంలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తారు. 12.15 గంటలకు ఛాయపురం గ్రామం చేరుకుని ప్రజావేదిక వద్ద అధికారులు, ఇంజనీర్లతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రజావేదిక నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. 3.40 గంటలకు విమానంలో బయలుదేరి బెంగళూరుకు వెళ్తారు. సాయంత్రం 5.30 గంటలకు బెంగళూరులోని తాజ్ హోటల్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్తారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పుట్టపర్తి రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పుట్టపర్తి శ్రీ సత్యసాయి విమానాశ్రయం వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న తెలపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కి సంబంధించిన రూట్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ప్రశాంతి నియలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భూసేకరణ పనులను జాప్యం చేయొద్దు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణకు పనులు జాప్యం లేకుండా సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో ఎన్‌హెచ్ 342 ఎన్‌హెచ్ 716 జాతీయ రహదారులు, వివిధ భూ సేకరణకు సంబంధించి పనులు పురోగతిపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ కేటాయింపు ప్రతిపాదనలపైన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిబంధనల మేరకు సంబంధిత అధికారులు నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ 342 ప్యాకేజీ కింద బుచ్చయ్య గారి పల్లి ప్యాకేజీ కింద, కప్పలబండకు సంబంధించి భూ సేకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వేగవంతంగా పరిష్కరించాలన్నారు. నవంబర్ ఒకటవ తేదీ లోపల జాతీయ రహదారుల పనులు పూర్తి చేయాలన్నారు. డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు ఆనంద్, సువర్ణ, శర్మ, ఎన్‌హెచ్ పీడీ అశోక్ కుమార్, మల్లికార్జున రావు, నాగరాజు, సుజాత, ఆర్అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణములో నూతన ఆర్టీసీ బస్సును ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీసీ డిఎం ఐనుద్దీన్, సిబ్బంది ఎమ్మెల్యే కందికుంటకు ఘనంగా స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్సును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్టీసీ బస్సును నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

నూతన వైద్యశాల ప్రారంభం : పట్టణ పరిధిలోని సైదాపురం రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన భారతి కంటి ఆసుపత్రినిఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. వైద్యశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతి కంటి వైద్యశాల నిర్వాహకులు కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం : పట్టణంలోని ఆర్డీవోకార్యాలయం లో గురువారం ఆర్డీవో వీవీఎస్ శర్మ సమక్షంలో సబ్ డివిజనల్ పరిధిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు చేపట్టాల్సిన విధులను వివరించారు.ఈ కార్యక్రమంలో కదిరి తహశీల్దార్ మురళీకృష్ణ, ఎన్పీకుంట తహశీల్దార్ దేవేంద్ర, కదిరి రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.



స్త్రీ నిధి మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్త్రీ నిధి రుణాలు పంపిణీ

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండల కేంద్రంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 106 సంఘాల్లోని 398మంది మహిళలకు రూ. 3.41కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఒకప్పుడు వంటిళ్లు, పొలం పనులు తప్ప వేరే లోకం తెలియని మహిళలను పురుషులతో సమానంగా వ్యాపారం చేసే స్థాయికి తీసుకొచ్చింది చంద్రబాబేనన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. ఈ రుణాలను ఇంట్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు కాకుండా స్వయం ఉపాధి కోసం వినియోగించుకోవాలన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఈ నెలలోనే అమ్మకు వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా వారందరికీ రూ. 15వేల చొప్పున అందజేస్తామని అలాగే అన్నదాత సుఖీభవ డబ్బు ప్రతి రైతుకు అందుతుందని అన్నారు. కొత్త రేషన్ కార్డులకు కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. మరోవైపు కొత్త పింఛన్లు కూడా త్వరలోనే వస్తాయని చెప్పారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న బిజెపి

- ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను వెంటనే రెన్యువల్ చేయాలి
- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కెఎ.పాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న కెఎ.పాల్

దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రంలోని బిజెపి పాలన కొనసాగుతోందని ప్రజాశాంతి వ్యవస్థాపకుడు కెఎ.పాల్ అభిప్రాయ పడ్డారు. గురువారం అనంతపురం జిల్లాకు వచ్చిన ఆయన అనంత ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల అడుగులకు మడుగులు వత్తేలా చంద్రబాబు, పవన్, జగన్‌లు రాష్ట్రంలో ఉండడం విచాకరం అన్నారు. రాయలసీమ ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)కి సంబంధించిన ఎఫ్‌సిఆర్ఎ రెన్యూవల్ కాకుండా కేంద్రం అడ్డుకోవడం సరికాదన్నారు. రెండు నెలల్లోపు రెన్యువల్ ప్రక్రియ చేయకపోతే ఈ విషయంలో తానే చొరవ చూపి దీనిని పూర్తి చేయిస్తానన్నారు. ప్రపంచ దేశాల నుంచి సాయం తీసుకొచ్చే శక్తి సామర్థ్యాలు తనకు ఉన్నాయని దేశం, రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు కృషి అందిస్తానన్నారు. ఇటీవల మరణించిన ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆయన మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం చేసి నిజాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధం ఆపడానికి తాను పాకిస్తాన్ వెళుతున్నట్లు తెలిపారు.

పస్తులుంటూ పని చేయాలా..?

- ముఖ్యమంత్రి దృష్టికి శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను తీసుకెళ్తాం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను పస్తులుంచి పనులు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గత 33 రోజులుగా సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు సిఐటియు నాయకులు సిద్ధం అయ్యారు. శుక్రవారం నాడు జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను విన్నవిస్తామని తెలియజేశారు. గురువారం ఉదయం కళ్యాణదుర్గం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం నుంచి శ్రీరామిరెడ్డి కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. పల్లెలను చరుస్తూ మా ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టవా అంటూ నినాదాలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3. నెలల పిఎఫ్, 7 నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై కార్మికులు 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచాకరం అన్నారు. ఉరవకొండలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో కార్మికులు వారి కుటుంబాలతో సహ అక్కడికి వెళ్లి సమస్యలను విన్నవిస్తారన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి కార్మికుల సంఘం నాయకులు వన్నూరుస్వామి, నరేష్, గంగాధర్, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

పల్లెలు చరుస్తూ నిరసన తెలుపుతున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు

విద్యుత్‌తీగలపై విరిగిపడిన చెట్టు

వర్షం.. ఈదురుగాలులు..!

ప్రజాశక్తి - అమడగూరు

మండల వ్యాప్తంగా గురువారం గాలివాన భీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఎక్కువగా గాలులు వీచడంతో అక్కడక్కడ చెట్లు కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది అంతేకాకుండా మహమ్మాదాబాద్ గ్రామం కాలనీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. గాలి వాన పరిస్థితుల ప్రభావం వలన ఏర్పడిన సంఘటనలపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

'పురం'మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక జరిగేనా..?

హిందూపురం మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎంపికపై సందిగ్దత నెలకొంది. వైస్‌ఛైర్మన్ ఎంపిక సజావుగా జరిగేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై కూటమి నాయకుల్లో కుమ్ములాటలు మొదలయ్యాయన్న విమర్శలు వినపడుతున్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో మొత్తం 38 వార్డులు ఉన్నాయి. 2021లో జరిగిన ఎన్నికల సమయంలో 29 వార్డులలో వైసిపి విజయరే సాధించింది. టిడిపి 6 స్థానాలు, బిజెపి, ఎంఐఎం చెరో ఒక స్థానం దక్కించుకుంది. 13వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన వెంటనే గెలిచిన కౌన్సిలర్ ఆ సమయంలో అధికారంలో ఉన్న వైసిపితో జత కట్టాడు. దీంతో వైసిపికి 30 మంది కౌన్సిలర్లు అయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో వైసిపి చేతిలో ఉన్న హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది. తాజాగా వైస్ ఛైర్మన్-1 పదవిపై ఆపార్టీ దృష్టి సారించింది. వైస్ ఛైర్మన్ -1 జబివుల్లా పదవీ కాలం నాలుగేళ్లు పూర్తికావడంతో ఆయనపై అవిశ్వాస తీర్మానానికి టిడిపి సిద్ధమైంది. వెంటనే 21 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ ఈనెల 12వ తేదీన వైస్ ఛైర్మన్ ఎంపిక ప్రక్రియను చేపట్టారు. దీనికోసం ప్రొసిడింగ్ అధికారిగా పెనుకొండ సబ్ కలెక్టర్‌ను నియమించారు.

జబివుల్లాపై సొంత పార్టీలోని వైసిపి కౌన్సిలర్ల లోనే వ్యతిరేకత ఉంది. దీంతో అవి శ్వాసానికి వారు మద్దతు పలుకుతుండటంతో టిడిపి ఈ మేరకు ప్రయత్నాలు చేస్తోంది. మైనార్టీ వర్గానికి చెందిన జబివుల్లాను పదవి నుంచి దింపితే, అదే వర్గానికి చెందిన టిడిపిలో చేరిన కౌన్సిలర్‌కు ఈ పదవి ఇస్తారా, లేక ఇతర సామాజిక వర్గాల వారికి కేటాయిస్తారా అన్నది ప్రశ్నగా ఉంది. టిడిపి నుంచి గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లలో ఆర్య వైశ్య, వడ్డే, దళిత సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు వడ్డె, దళిత సామాజిక వర్గాల వారికి పార్టీలో ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదని, కనీసం 8 నెలల పాటు ఉండే వైస్ ఛైర్మన్ పదవి అయిన తమ సామాజిక వర్గానికి కేటాయించాలని ఆయా సామాజిక వర్గాల వారు పార్టీ నాయకులపై ఒత్తిడి పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే విధంగానే వైశ్య సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ సైతం తాను పార్టీ ఆవిర్భావం ఉన్నానని తమకు గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. ఇక కూటమిలో జతకట్టిన బిజెపి సైతం వైస్ ఛైర్మన్ తమకు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే వైసిపి నుంచి టిడిపిలోకి చేరే సమయంలోనే 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ కు వైస్ ఛైర్మన్ ఇస్తామని పార్టీ నాయకులు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇందులో భాగంగా అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించాలని, సభ్యుల సంత కాలతో కూడిన ఫారం-1 పత్రాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు అందజేశారు. దీంతో సమావేశ నిర్వహణకు అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది.

కూటమిలో కుమ్ములాట

హిందూపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎంపిక కోసం జిల్లా కలెక్టర్ ఈనెల 12వ తేదీ ఖరారు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కూటమిలో కుమ్ములాట ప్రారంభమైంది. తమకు అంటే తమకే వైస్ ఛైర్మన్ పదవిని కేటాయించాలని అధికార పార్టీ నేతలపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వైస్ ఛైర్మన్ జబివుల్లా స్థానంలో వైస్ ఛైర్మన్ ఎంపిక జరుగుతోంది. ఈ పదవిని మైనార్టీ వర్గానికి కేటాయిస్తే అందులో ముందు వరుసలో 5వ వార్డులో గెలుపొందిన పెప్సీ ఇర్షాద్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇతనితో పాటు ఇదే సామాజిక వర్గంలో ఉన్న అయూబ్ కూడా పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇదే విధంగానే ఇప్పటివరకు మైనారిటీ సామాజిక వర్గంలో మహిళలకు ఎక్కడా గుర్తింపు ఇవ్వలేదని, మైనార్టీ మహిళలను గుర్తించి మహిళలకు కేటాయించాలన్న డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ఏడవ వార్డు నుంచి గెలుపొందిన నాసిర భాను సైతం పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే విధంగానే సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లలో వడ్డే సామాజిక వర్గానికి చెందిన మంజుళ, వైశ్య సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్ర, దళిత సామాజిక వర్గానికి చెందిన సతీష్ కుమార్ సైతం పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. ఇక కూటమిలో జత కట్టిన బిజెపి కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి సైతం వైస్ ఛైర్మన్ పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఒక్క పదవి కోసం ఇంతమంది పోటీ పడుతుండడం కూటమి నాయకులకు తలనొప్పిగా మారింది. వైస్ ఛైర్మన్ ఎంపిక కోసం అవిశ్వాసం తీసుకొచ్చిన కూటమి సర్కార్ ఎటు తేల్చుకోవాలో తెలియక తికమకలో పడింది. ఏ సామాజిక వర్గానికి కేటాయించిన మిగిలిన సామాజిక వర్గాలు అసంతృప్తితో ఉంటాయని భావించిన నాయకులు ఆచి తూచి అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలుస్తుంది.

వైస్ ఛైర్మన్ ఎంపిక జరిగేనా....?

మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లతో పాటు ఓటు హక్కు ఉన్న ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి మొత్తం సభ్యుల సంఖ్య 40. అవిశ్వాసం నెగ్గాలంటే సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది తీర్మానానికి మద్దతుగా ఓటు వేయాలి. అంటే టిడిపి ప్రతిపాదించే అవిశ్వాస తీర్మానాం నెగ్గాలంటే 26 మంది బలం కావాలి. ఏడాది క్రితం రాష్ట్రంలో మారిన రాజ కీయాల నేపథ్యంలో 13 మంది వైసిపి, ఒక్క ఎంఐఎం సభ్యురాలు టిడిపిలో చేరడంతో ఆ పార్టీ సొంత కౌన్సిలర్ల సంఖ్య 20కి చేరింది. ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మొదటి నుంచి మద్దతు పలుకుతున్న బిజెపి కౌన్సిలర్ తో కలిపి మొత్తం బలం 23కి చేరుకొంది. అధికార పార్టీ ప్రతిపాదించిన అవిశ్వాసంలో నిగ్గాలంటే వైసిపికి చెందిన మరో ముగ్గురి కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉంది. వారు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయక పోతే వీగిపోయే అవకాశాలు ఉన్నాయి. సంఖ్యా బలాన్ని సాకుగా చూపి అధికార పార్టీ వైస్ ఛైర్మన్ ఎంపికను వాయిదా పడే విధంగా చేసే ప్రయత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కార్మిక సంఘాలు, సిఐటియు జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మతోన్మాద మోడీ ప్రభుత్వం కాలరాసేందుకు పూనుకుందన్నారు. భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్లకు లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రానికి ముందుగాని, తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవీ కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 3 నల్ల చట్టాలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను ఎంచుకుంటున్నారు. కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లాకోశాధికారి సాంబశివ, సీనియర్ నాయకులు రామకృష్ణ, ఎఐయుటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సిఐటియు నాయకులు గంగాధర్, కొత్తచెరువు మండల కన్వీనర్ ముత్యాలప్ప, బుక్కపట్నం మండల కన్వీనర్ అంజితో పాటు వివిధ రంగాల కార్మికులు సరస్వతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : దేశ వ్యాప్తంగా కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వేమయ్య కోరారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం పుట్టపర్తి సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వేమయ్య మాట్లాడుతూ, మే 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెలో కార్మిక లోకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చౌళూరు రవికుమార్, మారుతి రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని కళ్లకుంట సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. రొద్దంలో దుకాణాల్లో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ద్విచక్రవాహనాల్లో ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు మృతదేహాలను పోలీసులు పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సుంది.

వరకట్న వేధింపు కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి బంధుసాబ్ వీధిలో నివాసముండే షేక్ జైనబ్ అనే మహిళ ఫిర్యాదు మేరకు గోరంట్లకు చెందిన నూర్ మహమ్మద్ పై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఏడాది క్రితం వివాహం సమయములో 15 తులాలు బంగారు తో పాటు నగదు ఇచ్చి వివాహం చేసినప్పటికీ అధిక కట్నం తీసుకురమ్మని హింసిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో తెలిపినట్లు సిఐ తెలిపారు. వివాహిత ఫిర్యాదు మేరకు ఆమె భర్తతోపాటు అత్తమామలపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని నల్ల బోయినపల్లి ఎస్సీ కాలనీ కి చెందిన సాకే పెద్దక్క(76) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. గ్రామానికి చెందిన సాకే పెద్దక్క బుధవారం మధ్యాహ్నం గ్రామానికి వెళ్లి స్టోర్ బియ్యం తీసుకొని రావడానికి అదే కాలనీకి చెందిన తనకు వరుసకు మనమడు అగు సాకే హరీష్‌కు చెందిన ద్విచక్రవాహణంలో బయలుదేరింది. ఆసమయంలో పెద్దక్కకు కళ్లు తిరగడంతో కిందికి పడింది. గమనించి స్థానికులు గాయపడిన పెద్దక్కను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెద్దక్క మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి : మండల కేంద్రంలోని వినాయక నగర్ కు చెందిన మందల మంజునాథ్ (32) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీడీవోగా పార్థసారథి

ప్రజాశక్తి -నంబులపూలకుంట

ఎన్పీకుంట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్ పార్థసారథి గురువారం బాధ్యతలు చేపట్టారు గతంలో నంద్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.ఉపాధి పథకంలో జాబ్ కార్డు ఉన్నవారికి పనులు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవరెడ్డి, ఏపీవో మంజుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు గ్రామపంచాయతీకి చెందిన షాపింగ్ గదులకు శుక్రవారం వేలంపాటను గ్రామ సర్పంచి రాధ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 9 షాపింగ్ గదులకు వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిపాజిట్, ఆస్తి సర్టిఫికెట్ చెల్లించిన వారు మాత్రమే ఈ వేలం పాటలో పాల్గొనాలన్నారు.

భూసార పరీక్షలు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని మర్రిమాకులపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖాధికారులు భూసార పరీక్షలు చేపట్టారు. ఇదే విధంగా అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో 973 మట్టి నమూనాలను మే నెల ఆఖరు లోగా సేకరించడం జరుగుతుందని ఎఒ రమాదేవి తెలిపారు. భూసార పరీక్ష ఆధారంగా నేలలో పోషక లోపాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా పంటకు అవసరమైన మేరకే ఎరువులను వాడాలని అధికారులు సూచించారు.

ఆలయంలో ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామంలో గల చౌడేశ్వరి దేవి ఆలయంలో ఈనెల 12న కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు ప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ భువనేశ్వర్ రెడ్డి, కపిల్ రెడ్డి తెలిపారు. ఆలయంలో ఈనెల 1వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండల పరిధిలోని డబురువారి పల్లిలోని బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ జయచంద్ర, వారి కుటుంబ సభ్యులు తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ప్రమాదంలో జయచంద్ర మనవరాలు హరిప్రియ (11)అక్కడకక్కడే మృతి చెందింది. మిగతా కుటుంబ సభ్యులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పల్లె గురువారం బాధితులను పరామర్శించారు. ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జయచంద్ర, రాజారెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి ఎంపిడిఒగా వెంకట లక్ష్మమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శింగనమల నుంచి ఉద్యోగోన్నతిపై ఆమె ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కంబాలపల్లిలో అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఓ లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ అధ్యక్షతన మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్షత, హింసపై నాటిక రూపంలో ప్రదర్శించారు. గృహహింస, బాల్యవివాహాలు, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది మహాశక్తి నుంచి సీఈవో రమీజా, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మహిళలు, ప్రతినిధులు

బీసీ కార్డు పేరుతో భారీ స్కాం

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహిళల పేరుతో మహిళా మంత్రి దోపిడీ
వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అవినీతే సిగ్గుపడేలా కూటమి ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని మహిళల పేరుతో మహిళా మంత్రి దోపిడీకి తెరలేపిందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులతో కలిసి దీపికా వేణు రెడ్డి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీపికా వేణు రెడ్డి, మధుమతి రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, మహిళ విభాగం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడారు. మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా, వారిని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాజాగా బీసీ కార్డుతో భారీ స్కాం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీల పార్టీ అని, బీసీలు తమకు బలమని చెప్పుకుంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ బిసి మహిళల పేరుతో భారీ స్కాంకు పాల్పడిందని ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలకు ఆర్థిక అభివృద్ధి పేరుతో టైలరింగ్ లో శిక్షణను ఇచ్చి, కుట్టు మిషన్ వారికి ఇవ్వాలని టెండర్లను పిలవడం జరిగిందన్నారు. ఈ టెండర్ లో దాదాపు 65 కంపెనీలు పాల్గొన్నాయనిటెండర్ నిబంధనల మేరకు తక్కువ కోడ్ చేసిన వారికి కేటాయించాల్సి ఉన్నప్పటికీ వారికి కాకుండా బినామీలకు ఎక్కువ ధరకు కేటాయించారని ఆరోపించారు. టెండర్ సొంతం చేసుకుని శిక్షణ ఇస్తున్న సంస్థ శిక్షణ కేంద్రాల్లో మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి టైలరింగ్ కిట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ఇవేవీ ఇవ్వకుండా తూతూ మంత్రంగా శిక్షణను ఇచ్చి, నాణ్యతలేని కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. బిసి మహిళలతో పాటు అన్ని వర్గాల మహిళలను మోసం చేస్తున్నారన్నారు. అప్పుల్లోనే కాదు, అవినీతి లోను సైతం కూటమి సర్కార్ రికార్డు సృష్టించిందని ఎద్దేవా చేశారు. బాబు షూరిటీ అవినీతి గ్యారెంటీగా మారిపోయిందన్నారు. ఎన్డిఎ అంటే నారా దోపిడీ అలయన్స్ గా మార్చారని ఎద్దేవా చేశారు.. మహిళా మంత్రిగా ఉన్న శాఖలో మహిళల పేరుతో అవినీతి జరగటం దారుణమన్నారు. దీనిపై ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం నోరు మెదపడం లేదంటే భారీ అవినీతి జరిగిందని అర్థమవుతుందనిఅన్నారు. ఇందులోనే కాకుండా ఇసుక, మట్టి, మద్యం, అమరావతి నిర్మాణాలు, ఉర్సా భూములు ఇలా ప్రతి దానిలోను స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. కుట్టు మిషన్ల స్కీంని కమిషన్ల స్కామ్ గా మార్చారన్నారు. కుట్టు శిక్షణ ఇచ్చి మహిళలకు మిషన్ పంపిణీ చేయడానికి అయ్యే ఖర్చు రూ. 7,300 అవుతుందనిఅయితే ప్రభుత్వం ఏకంగా 23వేలు ఖర్చు చేస్తోందని విమర్శించారు. ఈ ఒక్క స్కీం లోనే రూ. 157 కోట్లు దోచుకొనేందుకు ప్లాన్ చేశారని ఆరోపించారు. మొబలైజేషన్ అడ్వాన్సులు కూడా ఇచ్చి అవినీతికి తెర లేపారన్నారు. ఎల్-1 ఐదు శాతం పని, ఎల్-2,ఎల్-3 కాంట్రాక్టర్ కు 95 శాతం పని ఇవ్వటం వెనుక కుట్ర ఉందన్నారు. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి, విచారణ జరపాలని, వెంటనే టెండర్ ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడంతోపాటు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి, రెవిన్యూ అధికారికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు షాజియా, నాగేంద్ర కుమార్, వైసిపి నాయకులు నాగమణి రామకృష్ణారెడ్డి, దాదు, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయం ముందు ఆందోళన చేసి ఎఇఒలు గంగప్ప, ప్రశన్న లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈరేష్ మాట్లాడుతు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వహకులు ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్నప్పటికి విద్యాశాఖ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం పాఠశాలల నిర్వహకులు కేజీ నుండి పదవ తరగతి వరకు రూ.30 వేల నుంచి 50వేల రూపాయల వరకు విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అయితే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కూడా సరిగా కల్పించడం లేదన్నారు. ఫీజులతో పాటు ఇక్కడే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బుక్స్, టై, బెల్టు కొనాలని నిబంధన పెట్టి రూ. 6 వేల నుంచి 12వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిబందనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే విద్యాశాఖ అధికారులు మాముళ్లు తీసుకుని వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిబందనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోక పోతే ఆలాంటి విద్యా సంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేపడుతామనిదీనికి విద్యాశాఖ అధికారులే భాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇస్మాయిల్, ఉమేష్, ఉజఫా, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను రెండు రోజుల్లో సిద్ధం చేసి అందించాలని సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలకు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆదేశించారు. గురువారం చైర్మన్ రమేష్ కుమార్ తన ఛాంబర్ లో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ తో కలిసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సచివాలయ కమ్యూనిటీ సెక్రెటరీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో రూ. 92.50 కోట్లు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. మున్సిపల్ ఇంజనీర్లు, అమ్యూనిటీ సెక్రటరీలు, వార్డు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆయా వార్డుల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగు కాలువలు ఇతర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అందరం కలిసి పట్టణాన్ని సర్వసుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన పురపాలక సంఘంగా మార్చుదామన్నారు. దీనికోసం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రతి అధికారి అహర్నిశలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డిఇలు వాణి, ఆనందరాజు, ఏఈలు జనార్ధన్, శంకర్, ధీరజ్, ఆయా సచివాలయాల కమ్యూనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కామ్రేడ్ రవీంద్ర వర్ధంతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని సిపిఎంకార్యాలయంలో గురువారం కామ్రేడ్ కొండా రవీంద్ర నాలుగో వర్ధంతిని సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఈడిగ లక్ష్మీనారాయణ , వెంకటేష్ , మాబు , కొండా వెంకటేష్ , నాగ భూషణ్ , బెస్త కిష్టప్ప , కొండప్పరవి , మగ్గాల రామాంజి , ఈడిగ నాగరాజ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రజకుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఆ సంఘం నాయకులు తో కలసి కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎప్పటినుంచో ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ధోబీఘాట్లు లేనందున రజకులు తమ వృత్తిని కొనసాగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రజకుల్లో 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబనపల్లి శ్రీనివాసులు, బురుకుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బూర్గాల నాగరాజు, కదిరి పట్టణ అధ్యక్షులు గంగన్న, పుట్టపర్తి అధ్యక్షులు గంగాధర్, నాయకులు పెద్దయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు రాధమ్మ, చెన్నకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని బూచర్ల గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి మండల నాయకులు గురువారం భూమిపూజ చేశారు. 60 వేల లీటర్ల కెపాసిటీ తో దాదాపు రూ. 30 లక్షల బడ్జెట్ తో ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నరహరి, హరీష్, మంజు,సిద్దన్న, బాషా, డీలర్ చంద్రమౌళి, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాలు, కదిరన్న, నరసింహులు, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

'దుర్వాసన భరించలేకున్నాం'..

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని 32వ వార్డు పరిధిలో గల ఆహ్మద్ నగర్‌లో దుర్వాసన భరించలేకుండా ఉన్నామని ఆకాలనీవాసులు వాపోయారు. మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టకుండా, కచ్చ కాలువలు ఏర్పాటు చేయడంతో వాటిని శుభ్రం చేయక పోవడంతో అవి నిండి దుర్వాసన వెదజల్లుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు సారమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆహ్మద్ నగర్ అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో మురుగు కాలువలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చిన్న పాటి వర్షానికే కచ్చ కాలువలు నిండి ఇళ్లలోకి నీరు చేరుతున్నాయన్నారు. మున్సిపల్‌కమిషనర్ ముందు సమస్యను వివరించినప్పటికి ఆయన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించకుంటే లోక్ అదాలత్ తో పాటు మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ ప్రాంత వాసులు షంషీన్, నసీమా బాను, అయిషా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్, ఎస్పీ

ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లా ఉరవకొండ పర్యటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం వస్తున్న నేపథ్యంలో శ్రీ సత్య సాయి విమానాశ్రమంలో పటిష్ట పోలీసు భద్రత ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఉదయం 10:50 నిమిషాలకు సత్యసాయి విమానాశ్రయానికి చేరుకుంటారని అనంతరం అక్కడి నుండి 10 : 55, నిమిషాలకు ప్రత్యేక హెలికాప్టర్లో ఉరవకొండకు వెళతారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ,ఎస్పీ ముఖ్యమంత్రి భద్రత సిబ్బందితో కలిసి హెలిపాడ్ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టిందని ఎస్పీ తెలిపారు. సత్యసాయి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం బందోబస్తుకు వచ్చిన డీఎస్పీ , సిఐ, ఎస్ఐ, సిబ్బందికి బందోబస్తుపై ఎస్పీ, సిఎం సెక్యూరిటీ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి దిశా నిర్దేశం చేశారు. సెక్టర్ ఇంచార్జ్ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేటాయించిన విధులను పూర్తి బాధ్యతలతో చేపట్టాలని ఆదేశించారు. వై జంక్షన్ నుండి కేవలం ముఖ్యమైన ప్రజాప్రతినిధుల వాహనం మాత్రమే ఎయిర్‌పోర్టు వరకు అనుమతించబడుతుందన్నారు. లోపలికి వచ్చే మెయిన్ గేట్ వద్ద బిఎఫ్ ఎండి ద్వారా క్షుణంగా చెకింగ్ చేసి పంపాలన్నారు. విఐపి లకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతంలో వారి వాహనాలు మాత్రమే నిలిపే విధంగా చూడాలన్నారు. కలెక్టర్ మంజూరు చేసిన జాబితాలో పేర్లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో బ్యారికెడింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , ఇతర భద్రత ఏర్పాట్ల గురించి ఎస్పీ ఆరా తీశారు.సత్య సాయి విమానాశ్రయం చుట్టూ బందోబస్తు పకడ్బందీగా ఉండాలన్నారు. బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు , , బాంబ్ స్క్వాడ్ బృందాలు, సెక్టర్ ఇన్‌ఛార్జి అధికారులు , రూట్ బందోబస్తు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యమంత్రి విమానాశ్రయం నుండి వెళ్లే వరకు పోలీస్ అధికారులకు కేటాయించిన పాయింట్లలో పూర్తిగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో, డీఎస్పీలు విజయ్ కుమార్, నరసింగప్ప, శివన్నారాయణ స్వామి, ఎఆర్ డిఎస్పి, శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు మహేష్, వలి సిఐలు, ఎస్ఐలు ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కదిరి, ముదిగుబ్బ వైపు నుండి వచ్చే వాహనాలు కర్ణాటక నాగేపల్లి గణేష్ సర్కిల్ నుండి బ్రాహ్మణపల్లి, సూపర్ హాస్పిటల్ మీదుగా వెళ్లాలన్నారు. కమ్మవారి పల్లి నుండి వచ్చే వాహనాలు బైపాస్ మీదుగా వెళ్లాలని, అదేవిధంగా కొత్తచెరువు గోరంట్ల వైపు నుండి వచ్చే వాహనాలు మామిళ్లకుంట క్రాస్ సూపర్ స్పెషాలిటీ బీడుపల్లి క్రాస్ బ్రాహ్మణపల్లి మీదుగా ఎనుములపల్లి , చిత్రావతి బైపాస్ మీదుగా వాహనాల మళ్లింపులు చేపట్టడం జరిగిందని చెప్పారు.

పటిష్ట భద్రత ఏర్పాట్లు : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా
3 డీఎస్పీలుచ 13మంది సిఐలు, 12 మంది ఎస్ఐలు, 99 మంది ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 114 మంది పోలీసులు, 36 మంది మహిళా పోలీసులు, 65 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా 3 స్పెషల్ పార్టీ,3 ఏఆర్ టీములను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.